సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



108 ప్రసాదాలతో విఘ్నేశ్వరుడికి నైవేద్యం

వినాయక నవరాత్రుల ఉత్సవాలను మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం గాంధీబొమ్మ సెంటర్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. 21వ వార్షికోత్సవ వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 108 రకాల ప్రసాదాలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు సమకూర్చిన ప్రసాదాలను నివేదించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– నర్సీపట్నం

న్యూస్‌రీల్

వైఎస్సార్ సేవలను స్మరించుకుందాం

- విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడదాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ పిలుపు



సాక్షి, అనకాపల్లి: మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జిల్లాలో వాడవాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ్ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా అనకాపల్లి టౌన్‌లో రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంతో పాటుగా ఆయా నియోజక వర్గాల పరిధిలో సమన్వయకర్తలు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మహానేతకు ఘన నివాళులర్పించాలన్నారు. అలాగే వైఎస్సార్ విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రక్తదానం, అన్నసమారాధన, పండ్లు, రొట్టెల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి, అనకాపల్లి జిల్లాకు ఆయన చేసిన సేవలను స్మరించుకుందామన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం



పింఛన్ సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: సామాజిక పింఛన్ల పంపిణీని కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో ప్రారంభించారు. దివ్యాంగులైన పెట్ల సంతోష్, దాసరి అప్పారావులకు, వృద్ధాప్య పింఛనుదారుడైన కరణం అప్పలనాయుడుకు నగదు అందించారు. డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.


41,546 హెక్టార్లలో వరి నాట్లు పూర్తి

తుమ్మపాల: జిల్లాలో 41,546 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయినట్టు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. వరితో పాటు ఇతర పంటలకు సంబంధించి ఇంకా 3,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1,111 మెట్రిక్ టన్నుల యూరియా ప్రైవేట్ డీలర్లు, సొసైటీలు, రైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉందన్నారు. ఈ వారంలో 730 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కోసం కేటాయింపులు చేశామన్నారు. యూరియా నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ చేయకుండా విజిలెన్స్, మల్టీ డిసిప్లినరీ టీమ్స్, వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఆధునిక విశాఖ నిర్మాత వైఎస్సార్



- ఉమ్మడి విశాఖ జిల్లా దశ మార్చిన దార్శనికుడు వైఎస్సార్
- పరిశ్రమలకు ప్రాణం.. ఐటీకి పునాది
- గ్రేటర్ విశాఖ రూపశిల్పి మహానేతే
- మరుపురాని మహానేత గురుతులు
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి



సాక్షి, విశాఖపట్నం: ఒక నాయకుడు వేసే అడుగులు భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేస్తాయి. ఒక దార్శనికుడి ఆలోచనలు ఒక ప్రాంతపు రూపురేఖలనే మార్చేస్తాయి. అలాంటి ఓ గొప్ప నాయకుడు, దార్శనికుడే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన పాలనలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అభివృద్ధి, సంక్షేమంలో స్వర్ణయుగాన్ని చూసింది. కేవలం సమస్యలను పరిష్కరించడమే కాదు, భవిష్యత్ అవసరాలను ముందుగానే ఊహించి, ఆధునిక విశాఖ నిర్మాణానికి పటిష్టమైన పునాదులు వేశారు. పరిశ్రమల పునరుజ్జీవం నుంచి ఐటీ విప్లవం వరకు, గిరిజన హక్కుల నుంచి పేదవాడి సొంతింటి కల వరకు.. ప్రతీ రంగంలోనూ ఆయనది చెరగని సంతకం. ఆయన మనల్ని విడిచి 16 ఏళ్లు గడుస్తున్నా, ఆయన ప్రారంభించిన అభివృద్ధి ఫలాలు నేటికీ విశాఖ ప్రజలకు అందుతూనే ఉన్నాయి. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మహానేత జిల్లాకు అందించిన సేవలను మరోసారి గుర్తు చేసుకుందాం.

'గ్రేటర్'హోదా ఆయన చలువే..



ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 'గ్రేటర్' హోదా కలను వైఎస్సార్ సాకారం చేశారు. 2005 నవంబర్ 22న విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌ను 'మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)'గా ఉన్నతీకరించారు. దీంతో నగరం 111 చదరపు కిలోమీటర్ల నుంచి 540 చ.కి.మీలకు విస్తరించి, అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకుంది. 2013లో భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీలని విలీనం చేయగా 681.96 చ.కిమీ. విస్తరించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మరో 10 పంచాయితీలను గ్రేటర్‌లో విలీనం చేసి.. 98 వార్డులుగా విస్తరించారు. అలాగే జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం (జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం) కింద దేశవ్యాప్తంగా ఎంపికైన 63 నగరాల్లో విశాఖను చేర్చిన ఘనత వైఎస్సార్‌దే. ఆయన చొరవతో ఈ పథకం ద్వారా నగరానికి సుమారు రూ.1,885 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో సింహాచలం–పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్లు, ఆశీల్‌మెట్ట ఫ్లైఓవర్, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ (యూజీడీ) వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి.

ఉమ్మడి జిల్లాపై చెరగని ముద్ర



2004 నాటికి ఉమ్మడి విశాఖ జిల్లా పారిశ్రామికంగా సంక్షోభంలో ఉంది. స్టీల్ ప్లాంట్, బీహెచ్‌పీవీ, షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలతో మూసివేత దశకు చేరుకున్నాయి. వైఎస్సార్ ఈ సంస్థల పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టారు. నష్టాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించి, రెండో దశ విస్తరించాలని నిర్ణయించారు. భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్ (బీహెచ్‌పీవీ)ని బీహెచ్‌ఈఎల్‌లో విలీనం చేసి, దానికి కొత్త జీవం పోశారు. మూతపడే స్థితిలో ఉన్న హిందుస్థాన్ షిప్‌యార్డ్‌ను రక్షణ శాఖలో విలీనం చేసి పునరుద్ధరించారు. అలాగే అచ్యుతాపురం సెజ్, పరవాడ ఫార్మాసిటీ, గంగవరం పోర్టు వంటి కీలక ప్రాజెక్టుల భూసేకరణ సమస్యలను పరిష్కరించి, పారిశ్రామిక ప్రగతికి మార్గం సుగమం చేశారు.

ఐటీకి పునాది వేసిన దార్శనికుడు

ఐటీ అభివృద్ధి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకూడదన్న ముందుచూపుతో.. విశాఖను కీలక ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించారు. రుషికొండ సమీపంలో ఐటీ సెజ్‌కు స్థలాన్ని కేటాయించి, కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించారు. ఆయన దార్శనికతకు ఆకర్షితులైన విప్రో, సత్యం వంటి దిగ్గజ కంపెనీలు విశాఖలో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయి. నేటి విశాఖ ఐటీ ప్రస్థానానికి ఆనాడే ఆయన బలమైన పునాది వేశారు.

పేద రోగులకు అండ



అంతర్జాతీయ విమానాశ్రయ సర్వీసులను విశాఖ ప్రజలకు పరిచయం చేయాలని వైఎస్సార్ సంకల్పించారు. అనుకున్నదే తడవుగా రూ.100 కోట్లు వెచ్చించి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తీసుకొచ్చారు. దీంతో ఒక్క సారిగా విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ సర్వీసులు పెరిగాయి. ఉత్తరాంధ్ర ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే లక్ష్యంతో.. హైదరాబాద్ నిమ్స్ తరహాలో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) నిర్మాణానికి 2006లో శ్రీకారం చుట్టారు. గోదావరి జలాలను విశాఖకు తరలించి, నగర తాగునీటి సమస్యతో పాటు స్టీల్ ప్లాంట్ పారిశ్రామిక అవసరాలను తీర్చారు. రాజీవ్ గృహకల్ప, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, వాంబే పథకాల ద్వారా నగర పరిధిలో లక్షకు పైగా ఇళ్లను నిర్మించి, ఎందరో పేదల సొంతింటి కలను నెరవేర్చారు.

గిరిజనుల ఆశాజ్యోతి



దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు అండగా నిలిచారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా వేలాది గిరిజన కుటుంబాలకు వారు సాగుచేసుకుంటున్న భూములపై హక్కు పత్రాలు అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ఏజెన్సీలో కాఫీ సాగును ప్రోత్సహించడానికి రూ.144 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును ప్రారంభించారు. దీని ద్వారా వేలాది మంది గిరిజనులకు స్థిరమైన ఉపాధి లభించింది. ఇలా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా విశాఖ ప్రజల మనసుల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు వైఎస్సార్.

అపర భగీరథుడు



పాయకరావుపేటలో తాండవ నదిపై నిర్మించిన మినీ బ్యారేజీ

నక్కపల్లి/నాతవరం: భారీగా వర్షాలు, వరదలు వచ్చిన సమయంలో సముద్రంలోకి వృథాగా పోతున్న తాండవ నీటిని సాగు కోసం ఉపయోగించాలనే తపనతో వైఎస్సార్ పాయకరావుపేటలో రూ.8 కోట్లతో మినీ ఆనకట్టలు నిర్మించారు. మహానేత మరణించి 16 ఏళ్లు గడచినప్పటికీ ఆయన అందించిన జలప్రసాదంతో నియోజకవర్గంలో రైతులకు ఖరీఫ్, రబీల్లో కూడా వరి, తమలపాకు, అరటి తదితర ఉద్యాన వన పంటలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. 40 ఏళ్లుగా ఈ ప్రాంత రైతులు ఆశిస్తున్న తాండవ జలాలను భూమి, ముత్తా, ఆవ, మంగవరం గ్రోయిన్‌ల ద్వారా విడుదల చేయించారు. పాయకరావుపేట వాటాకు రావాల్సిన 35 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించేందుకు ప్రత్యేక జీవో తెచ్చారు. అలాగే నాతవరం మండలంలోని తాండవ రిజర్వాయరు ప్రధాన పంట కాలువలకు సిమెంటు లైనింగ్ పనులు చేయించారు. పంట కాలువల అభివృద్ధి కోసం రూ.55 కోట్లు వెచ్చించారు. 120 కిలోమీటర్ల పొడవున సిమెంటు లైనింగ్ పనులు చేయడంతో శివారు ఆయకట్టుకు సైతం పుష్కలంగా సాగునీరు సరఫరా అవుతోంది.



సిమెంట్ లైనింగ్ పనులతో కాలువలో నిండుగా ప్రవహిస్తున్న తాండవ

అవే అర్జీలు

8లో



సాగుభూములకు లాక్కోవద్దంటూ మాకవరపాలెం మండలానికి చెందిన దళిత రైతుల నిరసన

వినతులు పరిష్కారం కాక మళ్లీ కలెక్టరేట్‌కు వస్తున్న అర్జీదారులు.. క్షేత్రస్థాయిలో పరిష్కరించని అధికారులు.. కలెక్టర్ ఆదేశించినా చర్యలు శూన్యం.. ఇదీ జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పరిస్థితి. కలెక్టరేట్ గేటు వద్ద పలు సమస్యలపై బాధితులు నిరసన వ్యక్తం చేశారు. సాగు భూముల్లో రైతులకు సమాచారం లేకుండా అధికారులు సర్వేలు చేస్తున్నారని, ఆందోళనతో రెండు నెలల క్రితం కలెక్టరేట్‌లో చేసిన వినతులపై అధికారులు కనీసం స్పందించలేదని, మూడోసారి తమ గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చామని మాకవరపాలెం మండలానికి చెందిన దళిత రైతులు తెలిపారు. జీడి, మామిడి తోటలతో సాగులో ఉన్న తమ భూములను లాక్కోవద్దంటూ రాచపల్లి, ఎరకన్నపాలెం గ్రామాలకు చెందిన వీరు కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన జరిపారు. రాచపల్లి సర్వే నెం.737లో ఎంతో కాలంగా సాగు చేసుకుంటూ ఫలసాయంతో జీవిస్తున్నామని, ఎస్సీ కార్పొరేషన్, డీఆర్‌డీఏ, హార్టికల్చర్ అధికారులు సాగుదారులుగా తమను గుర్తించి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, శిస్తులు కూడా చెల్లిస్తున్నామన్నారు. తమ భూములకు సర్వే జరిపి సాగు ఆధారంగా తమ పట్టాలు మంజూరు చేయాలని పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందించారు. కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు మొత్తం 260 అర్జీలు వచ్చాయి. ఎప్పటిలాగే అందులో రెవెన్యూ సమస్యలే అధికంగా ఉన్నాయి. –తుమ్మపాల

ఓపెన్‌లో రిజర్వేషన్లతో అన్యాయం

- జీవో 77 ప్రకారం వర్టికల్ విధానం అమలు చేయలేదని అభ్యర్థుల ఆరోపణ
- కలెక్టరేట్ ఎదుట అభ్యర్థుల ఆందోళన



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న డీఎస్సీ బాధిత అభ్యర్థులు, విదసం ప్రతినిధులు

ఆరిలోవ : డీఎస్సీ–2025లో మెరిట్ ర్యాంకులు సాధించిన అభ్యర్థులు కాల్ లెటర్లు రాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి కష్టపడి చదివి మంచి ర్యాంక్ సాధించినా ఉద్యోగానికి దూరమవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో తమకు అన్యాయం జరుగుతోందని అభ్యర్థులు వాపోతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 77 ప్రకారం వర్టికల్ విధానం అమలుకాలేదని గగ్గోలుపెడుతున్నారు. అభ్యర్థులను ఓపెన్ కేటగిరీ నుంచి రిజర్వేషన్‌లోకి దించి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. డీఎస్సీ రిజర్వేషన్ల కోటాలో కూటమి ప్రభుత్వం కోత విధించింది. దీంతో బాధిత అభ్యర్థులు ఆందోళనకు దిగుతున్నారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లాలో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ మెరిట్ జాబితా ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలనకు కాల్ లెటర్లు రాని సుమారు 20 మంది అభ్యర్థులు విదసం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వారంతా అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు. వారికి కాల్ లెటర్లు రాకపోవడంతో వారి వారి ర్యాంకులు, మార్కుల జాబితాతో కూడిన వినతి పత్రాలను జాయింట్ కలెక్టర్‌కు అందించారు. అనంతరం కలెక్టరేట్ ముందు ధర్నాకు దిగారు. కూటమి ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని, జనరల్ కేటగిరీలో ర్యాంకులు సాధించిన వారిని రిజర్వేషన్ కేటగిరీలోకి మార్చడం రాజ్యాంగ విరుద్ధమంటూ నినాదాలు చేశారు. జిల్లాలో ఎస్జీటీ ఓపెన్‌లో 115 పోస్టులు ఉండగా మెరిట్‌లో ఎంపికైన 58 మందిలో 20 మందికిపైగా ఎస్సీ, ఎస్టీలు మంచి ర్యాంకులు సాధించారని.. వారిని ఓపెన్ కేటగిరీ జాబితాలో కాకుండా రిజర్వేషన్ కేటగిరీకి మార్చేశారని.. దీంతో రోస్టర్ ప్రకారం అర్హత కలిగిన 20 మంది రిజర్వ్‌డ్ అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించి కాల్ లెటర్లు పంపలేదని వాపోయారు.

ఓపెన్‌లో 24వ ర్యాంకర్‌ను ఎస్సీ కేటగిరిలోకి మార్చేశారు..



ఎస్సీ కేటగిరి రిజర్వేషన్‌లో 7 పోస్టులు చూపించారు. నేను ఓపెన్‌లో 149వ ర్యాంక్ సాధించి ఎస్సీ కేటగిరిలో 7వ స్థానంలో ఉన్నాను. కానీ 24 ర్యాంక్ సాధించిన ఓపెన్‌లో ఉన్న వ్యక్తిని ఎస్సీ కేటగిరిలో మార్చారు. దీంతో నా స్థానంలో కిందకి వెళ్లిపోయి ఏడో స్థానం దాటిపోయింది. దానివల్ల నాకు కాల్ లెటర్ రాలేదు. ఓపెన్‌లో ఉన్న ఎస్సీ అభ్యర్థిని రిజర్వేషన్ కేటగిరిలో పెట్టేయడంతో ఏడో స్థానంలో ఉన్న నాకు అన్యాయం జరిగింది. నాకు న్యాయం చేయాలి. – అనిల్‌కుమార్, అవనాం, భీమిలి

బీసీ 'ఏ'లో 141వ ర్యాంక్ సాధించినా కాల్ లెటర్ రాలేదు..



నేను బీసీ'ఏ' కేటగిరికి చెందిన అభ్యర్థిని. ఈ డీఎస్సీలో 141వ ర్యాంక్ సాధించాను. ఓపెన్‌లో 23వ ర్యాంకర్ అయిన బీసీ 'ఏ' అభ్యర్థిని బీసీ 'ఏ' రిజర్వేషన్ కేటగిరిలో పెట్టారు. దీంతో నా స్థానం వెనుకకు వెళ్లిపోయింది. కాల్ లెటర్ పంపించలేదు. ఈ విధానం వల్ల నాకు అన్యాయం జరిగింది. నాలాగ ఆవేదనకు గురవుతున్నవారు ఎందరో ఉన్నారు. అర్హులందరికీ తగిన న్యాయం చేయాలని కోరుతున్నాను.

– శీలా అభియాంగో, విశాఖ

ఎస్సీ 'బీ'లో 360 ర్యాంక్ సాధించినా ప్రయోజనం సున్నా



నేను ఎస్సీ 'బి' కేటగిరికి చెందిన అభ్యర్థిని. 360వ ర్యాంక్ సాధించాను. 77 జీవో ప్రకారం వర్టికల్ విధానం పాటించకపోవడంతో నాకు అన్యాయం జరిగింది. ఓపెన్‌లో 39వ ర్యాంకర్‌ను ఎస్సీ'బీ' కేటగిరిలోకి మార్చేశారు. దీంతో నా స్థానం కోల్పోయాను. ఉద్యోగానికి దూరం కావాల్సి వచ్చింది. వర్టికల్ విధానం అమలు చేసి నాకు న్యాయం చేయవలసిందిగా కోరుతున్నాను. ర్యాంకింగ్ విధానం సరిగా అమలు చేయలేదు.

–శేఖర్‌బాబు, విశాఖ

దిగి వచ్చిన సర్కార్

దివ్యాంగులకు యథావిధిగా పింఛన్ల బట్వాడా

సాక్షి ఎఫెక్ట్..

మాడుగుల రూరల్/కోటవురట్ల: దయలేని కూటమి సర్కార్ దిగి వచ్చింది. కదలలేక దయనీయ స్థితిలో ఉన్న దివ్యాంగులు.. పాతిక, ముప్పై ఏళ్లకు పైగా పింఛన్ అందుకుంటున్న వారు.. నిబంధనల ప్రకారం 40 శాతం వైకల్యం దాటి 60.. 80 శాతానికి పైగా సమస్య ఉన్న వారిని సైతం అనుమానిస్తూ, అవమానిస్తూ, దొంగ సర్టిఫికెట్లని కించపరుస్తూ పెన్షన్ నిలిపివేస్తున్నట్టు నోటీసులిచ్చారు. వారి కష్టం కనిపిస్తున్నా కనికరించలేదు. ఆ విధి వంచితుల వ్యథను 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ప్రధాన సంచికలో పలువురు బాధితుల కథనాలతోపాటు జిల్లా సంచికలో 'దివ్యాంగుల గోడు' శీర్షికతో వారి ఆవేదనను అక్షరీకరించింది.



మాడుగుల మండలం కె.జె.పురం గ్రామానికి చెందిన భీశెట్టి కృష్ణ, కోటవురట్ల మండలానికి చెందిన గూడె గౌరి, శెన్నంశెట్టి భువనేశ్వరి, సన్నివాడ ప్రవీణ్ తదితరుల కన్నీటి కథలను వెలుగులోకి తెచ్చింది. ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తి, ఆగ్రహావేశాలను గమనించిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం సోమవారం ఎలాంటి కోత లేకుండా దివ్యాంగులందరికీ పింఛన్లు అందించింది. దీంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

అవే అర్జీలు..

- పరిష్కారం కాక మళ్లీ కలెక్టరేట్‌కు వస్తున్న అర్జీదారులు
- క్షేత్రస్థాయిలో పరిష్కరించని అధికారులు
- కలెక్టర్ ఆదేశించినా చర్యలు శూన్యం

తుమ్మపాల: పలు సమస్యలపై కలెక్టరేట్ చుట్టూ పదేపదే తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని అర్జీదారుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ప్రతి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఓ వైపు కలెక్టర్ కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సందర్శించి సమస్యలు పరిష్కరించకుండానే ఎండార్స్‌మెంట్లు ఇచ్చేసి చేతులు దులుపుకుంటున్నారని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో గత పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలే మళ్లీ వస్తున్నాయి. ఈ వారం అదేవిధంగా పునరావృతమయ్యాయి.

క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీలు పరిష్కరించాలి

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆమెతో పాటు జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించడానికి వీల్లేదన్నారు. అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు. ఈ వారం మొత్తం 260 అర్జీలు నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీ, భూపరిపాలన, ఏపీఐఐసీ ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్.సుబ్బలక్ష్మి, రామమణి, ఎస్‌డీ అనిత వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేలో హక్కుదారుల పేర్లు మార్చేసిన కూటమి నేతలు



కూటమి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో అందుబాటులో లేని రైతుల భూములను అన్యాయంగా తమ పేర్లతో నమోదు చేయించుకుని కూటమి నాయకులు ఆక్రమణలకు పాల్పడుతున్నారంటూ అనకాపల్లి మండలం కొండుపాలెం మాజీ సర్పంచ్ మధుపాడ శ్రీనివాసరావు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో చేపట్టిన రీసర్వేలో అనేక తప్పులు ఉన్నాయి. రైతుల పేరున పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ రీ సర్వే బృందాలు స్థానిక నాయకులతో కుమ్మక్కై భారీ అవినీతికి పాల్పడుతున్నాయి. 1.4 ఎకరాలున్న ఎంపీటీసీ భర్త నర్సింగరావు పేరున రీసర్వేలో 3.4 ఎకరాలు నమోదు చేశారు. తలారి ఎర్రమ్మ పేరున ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని రీసర్వే అనంతరం గుండు ఈశ్వరరావు పేరున మార్చేశారు. ఇలా అనేకమంది రైతుల భూములను ఇతరుల పేరున మార్చి చేపడుతున్న భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కొత్తపెంట పేరు మార్చాలని నిరసన

ఊరు పేరుతోపాటు మండలాన్ని మార్చి గ్రామస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామ పెద్దలతో పాటు గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఏడు కిలోమీటర్ల దగ్గరలో ఉన్న కె.కోటపాడు మండల కేంద్రాన్ని కాకుండా 28 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరాపల్లి మండల కేంద్రానికి రాకపోకలు చేయడం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, పాలకులు తమ సమస్యకు పరిష్కారం చూపాలి. దీంతోపాటు రికార్డుల్లో కొత్తపెంటగా ఉన్న పేరును కొత్తపేటగా మార్పు చేయాలి. మండల వ్యవస్థకు ముందు కొత్తపెంట గ్రామం కె.కోటపాడు తాలూకాలో ఉన్నప్పటికీ దేవరాపల్లి మండలంలో చేర్చడంపై 1987లో జరిగిన మండల పరిషత్ ఎన్నికలను గ్రామస్తులు బహిష్కరించారు. శాంతి భద్రతల సమస్యలప్పుడు కూడా పోలీసుల సేవలు అందడం లేదని వాపోతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేసి నిర్వాసితులకు న్యాయం చేయాలి

ఈ నెల 27న చేపట్టనున్న విశాఖ- చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేసి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఐ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. నక్కపల్లి మండలంలో భూముల సేకరిస్తున్న బుచ్చిరాజుపేట, కొత్తూరు, చందనాడ, తుమ్మలపేట, తమ్మయ్యపేట, పాటిమీద, మూలపర్ర, డీఎల్‌పురం గ్రామాల నుంచి తరలిస్తున్న 745 కుటుంబాల్లో వివాహమైన ఆడపిల్లలతో కలిపి ప్రతి ఒక్కరికి రూ.25 లక్షల నష్టపరిహారం, ఆర్ కార్డులు, 2013 భూసేకరణ చట్టం ప్రకారం చెల్లింపులు, వంటి అనేక సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ఇవేవీ పరిష్కరించకుండా చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం, మండల కార్యదర్శి రాజేష్, అప్పలరాజు తెలిపారు.



నిరసన చేస్తున్న కొత్తపెంట గ్రామస్తులు



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా అధికారులు

స్థలాన్ని ఆక్రమించి బెదిరిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

మా స్థలాన్ని ఆక్రమించి బెదిరిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని విశాఖపట్నానికి చెందిన నాగిరెడ్డి లావణ్య కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో రైల్వే పోలీస్‌గా పని చేస్తున్న నా భర్త శ్యామ్ అతని తండ్రి రిటైర్డ్ సామ్ముతో 2018లో అనకాపల్లి మండలం పిసినికాడ సర్వే నంబరు 47-1లో స్థలాన్ని కొనుగోలు చేశాం.

దీన్ని అనకాపల్లిలో విధుల్లో ఉన్న చోడవరం అటాచ్డ్ హెడ్ కానిస్టేబుల్ బి.రామకృష్ణ ఆక్రమించి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాడు. ఇంటి నిర్మాణం చేపట్టకుండా మాకు హాని చేస్తున్నారంటూ అతని నుంచి మా స్థలం ఆక్రమణకు గురికాకుండా న్యాయం చేయాలని గత నెల 25న పీజీఆర్ఎస్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇంతవరకూ చర్యలు లేకపోవడంతో కలెక్టరేట్‌ను ఆశ్రయించామని, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

క్లుప్తంగా

అర్జీలపై విచారణ చేసి పరిష్కారం : ఎస్పీ తుహిన్ సిన్హా



అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సోమవారం 32 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ భూ తగాదాలు -18, కుటుంబ కలహాలు -2, వివిధ విభాగాల సమస్యలు -12 వచ్చినట్లు చెప్పారు. అర్జీలు పరిశీలించి ఏడు రోజుల్లో తగిన విచారణ పూర్తి చేసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్‌ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


రాహుల్ గాంధీపై ఫిర్యాదు



సీఐ విజయకుమార్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

అనకాపల్లి: ప్రధాని నరేంద్రమోదీ తల్లి హీరాబెన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఉడ్‌పేట పార్టీ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ మీదుగా పట్టణ పోలీస్ స్టేషన్ వరకూ జిల్లా మహిళా మోర్చా సారథ్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ పట్టణ సీఐ టి.వి.విజయకుమార్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. పట్టణ సంతోషిమాత దేవాలయం చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులు బొడ్డేడ నాగేశ్వరరావు, గొర్లి రామానాయుడు, ఓరుగంటి నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

'రైవాడ' నుంచి 500 క్యూసెక్కుల నీరు విడుదల



రైవాడ జలాశయం స్పిల్‌వే గేటు ద్వారా వరదనీరు విడుదల చేస్తున్న దృశ్యం

దేవరాపల్లి: రైవాడ జలాశయం స్పిల్‌వే గేటు నుంచి 500 క్యూసెక్కుల నీటిని శారదానదిలోకి సోమవారం సాయంత్రం విడుదల చేశారు. మూణ్నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి జలాశయంలోకి భారీగా వరద నీరు పోటెత్తింది. జలాశయం గరిష్ట నీటి మట్టం 114 మీటర్లు కాగా.. ప్రస్తుతం 113.55 మీటర్లకు చేరుకుంది. ప్రమాదకర నీటిమట్టం 113.50 మీటర్లను దాటి పోవడంతో ఒక స్పిల్వే గేటును ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశామని డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. 900 క్యూసెక్కుల వరదనీరు(ఇన్‌ఫ్లో) వచ్చి చేరుతుంది. ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదల పెంచడం లేదా తగ్గించడం చేస్తామని, శారదానది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దీక్షితులపాలెంను డి.అగ్రహారంలో విలీనం చేయాలి



కలెక్టరేట్ గేటు వద్ద గ్రామ పెద్దలు

కె.కోటపాడు: మండలంలోని పింద్రంగి శివారు దీక్షితులపాలెం గ్రామాన్ని డి.అగ్రహారం గ్రామ పంచాయతీలో విలీనం చేయాలని సర్పంచ్‌లు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పింద్రంగి సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి, రెడ్డి లక్ష్మి, డి.అగ్రహారం సర్పంచ్ వేచలపు గున్నమ్మ, ఉప సర్పంచ్‌లు వేచలపు వరహాలమ్మ, కొయినాన అమ్మతల్లినాయుడు కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతిపత్రాలను అందించారు. ఇరు గ్రామ పంచాయతీ తీర్మానాలను అమలు చేసేలా చర్యలను తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టరుకు ఫిర్యాదు

- ప్రైవేటు కంపెనీకి భూములివ్వాలంటూ బెదిరిస్తున్నారని రైతుల వేదన

నాతవరం: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తమ జిరాయితీ భూములను ప్రైవేటు కంపెనీకి ఇవ్వాలంటూ బెదిరిస్తున్న రెవెన్యూ అధికారులుపై రైతులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరుకు ఫిర్యాదు చేసిన కాపీలు విలేకరులకు అందజేసి వారు గోడు వెళ్లబోసుకున్నారు. మండలంలో యం.బి.పట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం గ్రామం వద్ద నర్సీపట్నం -తుని ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని పైల సత్యం, కె.ప్రసాద్‌తో పాటు పలువురు రైతులకు జిరాయితీ భూములు ఉన్నాయి. ఆయా భూములు తాండవ రిజర్వాయరు నీటి ఆధారంగా రైతులు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నక్కపల్లి మండలంలో ప్రైవేటు కంపెనీకి ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువ నీటిని పైపులైను ద్వారా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ పైపులైను ఏర్పాటుతోపాటు ప్రైవేటు కంపెనీకి పలు నిర్మాణ పనులకు భూమి అవసరముంది. దాంతో సదరు కంపెనీ యాజమాన్యంతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కై సర్వే నంబర్లు 298/2, 295/3లో జిరాయితీ భూములు తక్కువ ధరకే ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. వీరికి కూటమి నేతలు అండదండలు ఉండటంతో రైతుల గోడు పట్టించుకోకుండా కొంతకాలంగా వేధిస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని ఈ భూములు ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. వీరు భూములు ఇవ్వడానికి అంగీకరిస్తున్నా ప్రభుత్వ నిబంధనలు ప్రకారం బెనిఫిట్స్ అడిగే అవకాశం ఇవ్వకుండా రిజిస్ట్రేషన్లు చేయాలంటూ బెదిరిస్తున్నారు. తాము చెప్పినట్లుగా వినకపోతే కోర్టులో కేసు వేసి వారి భూములు తాలుకా డబ్బులు బ్యాంకు ఖాతాలో వేసి వాటిని లాక్కుంటామని తహసీల్దార్, తదితరులు భయపెడుతున్నారు. అక్కడ భూములను కలెక్టరు, జేసీ స్వయంగా పరిశీలించి మార్కెట్ రేటు ప్రకారం డబ్బులతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నర్సీపట్నం - తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకున్న భూమి



రైతుల ఫిర్యాదు కాపీ

ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలి

తుమ్మపాల: క్రీడలను ప్రోత్సహించి, ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి కోరారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. యువత చెడు వ్యాసనాలకు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా క్రీడల వైపు మొగ్గు చూపేలా 24 మండల కేంద్రాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. పికెల్ బాల్ కోర్టు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేసి నివేదిక సమర్పించాలని ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రసాద్‌ను ఆదేశించారు. నర్సీపట్నం, అనకాపల్లి, యలమంచిలి మున్సిపాలిటీల పరిధిలో భూమిని సేకరించి ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాలని ఆయా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. 16 మండల కేంద్రాలకు 12 మండలాల్లో 25 సెంట్ల చొప్పున స్థల సేకరణ చేశామన్నారు. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖో-ఖో కోర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని జెడ్పీ సీఈవో నారాయణమూర్తిని ఆదేశించారు. మున్సిపాలిటీల పరిధిలో బ్యాడ్మింటన్ కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్.వెంకటరమణ, డీపీవో సందీప్, డీఈవో జి.అప్పారావునాయుడు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి మంజుల వాణి, డ్వామా పీడీ పూర్ణిమా దేవి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.06 కోట్లు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 28 రోజులకుగాను రూ.2 కోట్ల 6 లక్షల 29 వేల 844 వచ్చినట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై యాత్రిక సదన్‌లో సోమవారం హుండీల ఆదాయం లెక్కించారు. 174.840 గ్రాముల బంగారం, 10.335 కిలోల వెండి లభించినట్లు పేర్కొన్నారు. రోజుకు సరాసరి రూ.7 లక్షల 36 వేల 780 వచ్చినట్లు తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

విశాఖ లీగల్: ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో ఈనెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో నేర, సివిల్ , తదితర పెండింగ్ కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా ఫోన్: 0891-2560414, 2575046, ఇమెయిల్: vrkpdra@yahoo.com..d ra.vrp@ fmai.com అలాగే మండల న్యాయ సేవా సంఘాలులో సంప్రదించవచ్చని తెలిపారు.

పల్లె వెలుగు బస్సులు లేక అగచాట్లు

- కె.జె.పురం మీదుగా నడపాలని వేడుకోలు

మాడుగుల రూరల్: పాడేరు, విశాఖ, డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసులను కె.జె.పురం మీదుగా నడుపుతున్న యాజమాన్యం పల్లె వెలుగు బస్సులను నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు విజయరామరాజుపేట వద్ద బొడ్డేరు నదిపై తాత్కాలికంగా నిర్మించిన వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో విశాఖ నుంచి పాడేరు, అనకాపల్లి నుంచి పాడేరు, చోడవరం నుంచి పాడేరు ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను ఘాట్‌రోడ్డు కె.జె.పురం మీదుగా అప్పలరాజుపురం, జైతవరం ఉప్పరగూడెం వరహాపురం, చోడవరం మీదుగా నడుపుతున్నారు. కళాశాల విద్యార్థులు కోసం అనకాపల్లి డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సులను మాడుగుల నుంచి వద్దాది, బుచ్చెయ్యపేట, రాజాం మీదుగా అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు నడుపుతున్నారు. దీంతో రోజా మాడుగుల, కింతలి, కె.జె.పురం గ్రామాల నుంచి చోడవరంలో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అనకాపల్లి నుంచి మాడుగుల నడిపే హెయిర్ విత్ బస్సులు, అనకాపల్లి డిపో బస్సులను కె.జె.పురం మీదుగా నడపాలని వారు కోరుతున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు కొన్ని గ్రామాల్లో నిలుపుదల చెయ్యటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య కేంద్రమా.? కూటమి కార్యాలయమా.?

మునగపాక: తిమ్మరాజుపేట ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని కూటమి కార్యాలయంగా మార్చారేమోనన్న సందేహం ప్రస్తుతం అందరిలో కలుగుతోంది. విద్య, వైద్య కేంద్రాల సమీపంలో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు ఉండరాదన్న నిబంధనను తిమ్మరాజుపేటలో కూటమి నాయకులు తుంగలోకి తొక్కేయడంపై విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం భవనంలో సచివాలయం నిర్వహించేవారు. సచివాలయానికి కొత్త భవనం మంజూరు కావడంతో సంబంధిత భవనాన్ని పంచాయతీ తీర్మానం మేరకు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి కేటాయించారు. కొంత కాలంగా ఈ భవనంలో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు.

అయితే కూటమి నాయకులు మాత్రం ఆరోగ్య ఉపకేంద్రం అని కూడా చూడకుండా ఈ భవనానికి తమ నేతల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి స్వామి భక్తిని చాటుకుంటున్నారు. నిరోధించాల్సిన వైద్య సిబ్బంది, మండల అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భవనంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంపై ఏర్పాటు చేసిన కూటమి నాయకుల ఫ్లెక్సీలు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఎస్.రాయవరం : మండలంలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇరువురు వ్యక్తులు మృతి చెందినట్టు ఎస్‌ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. కోనవానిపాలెం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన కాసా దుర్గా ప్రసాద్ (28) తుని వైపు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనలో వలపుశెట్టి శ్రీలక్ష్మి అనే మహిళకు గాయాలయ్యాయి. ఆమెను స్థానికులు నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరాహనదిలో గల్లంతైన వ్యక్తి మృతి

లింగరాజుపాలెం గ్రామానికి చెందిన కోడిబోయిన సత్యనారాయణ(46) శనివారం వ్యవసాయ పనులు నిమిత్తం వరాహనది దాటి వెళ్లి నది ప్రవాహానికి కొట్టుకుపోయి ఆదివారం శవమై తేలాడని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. శనివారం ఇంటి నుంచి వమ్మవరం వైపు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి నదీ పరిసరాల్లో వెతకగా శవమై కనిపించినట్టు కుటుంబ సభ్యులు తెలిపినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

లారీని ఢీ కొట్టి వ్యక్తి మృతి



మృతుడు దుర్గా గోవిందు

పాయకరావుపేట : పట్టణంలో పండరీపురానికి చెందిన వ్యక్తి లారీని వెనుక నుంచి ఢీ కొట్టడంతో మృతి చెందినట్టు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. పండరీపురానికి చెందిన బండారు దుర్గ గోవిందు (39) తాపీపని ముగించుకుని ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో తన మోటారు బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. బైక్ ముందు వేగవంగా ప్రయాణిస్తున్న లారీ అజాగ్రత్తగా డ్రైవర్ బ్రేక్ కొట్టడం జరిగింది. దీంతో బైకుపై వస్తున్న దుర్గ గోవిందు లారీని వెనుక ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టరు కింద పడి యువకుడి మృతి



లోవరాజు మృతదేహం, లోవరాజు (ఫైల్)

కోటవురట్ల: ట్రాక్టరు కింద పడి సుర్ల లోవరాజు(30) అనే యువకుడు దుర్మరణం చెందాడు. కొడవటిపూడి శివారు చెరకు కాటా సమీపంలో సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కె.వెంకటాపురానికి చెందిన సుర్ల లోవరాజు, పోతురాజు శ్రీను కలిసి బైక్‌పై స్వగ్రామం వెళుతున్నారు. కొడవటిపూడి చెరకు కాటా సమీపంలోకి వచ్చేసరికి ముందు వెళుతున్న ఆయిల్‌పామ్ లోడు ట్రాక్టరును తప్పించే క్రమంలో బైక్ గోతిలో పడి అదుపు తప్పింది. బైక్ నడుపుతున్న శ్రీను రోడ్డు పక్కన పొలాల్లో తూలి పడిపోగా, వెనుక కూర్చున్న లోవరాజు ట్రాక్టరు వెనుక చక్రం కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

లారీ ఢీకొని బైకిస్ట్ దుర్మరణం



మృతుడు రామకృష్ణ

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం.. గొలుగొండ మండలం రామనాపల్లి నుంచి గాజువాకకు వెళ్తున్న బైక్‌ను బయ్యవరం పాల డెయిరీ వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న గాజువాకకు చెందిన చలపాక రామకృష్ణ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యం

- రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- కేజీహెచ్‌లో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్ ప్రారంభం

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్‌ను క్యాన్సర్ రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కేజీహెచ్ క్యాన్సర్ చికిత్సా కేంద్రంలో సుమారు రూ.42 కోట్లతో సమకూర్చిన అధునాతన వైద్య పరికరాలను, స్క్రీనింగ్ యంత్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిధులు మంజూరైన విషయం విదితమే. పరికరాల్లో లీనియర్ యాక్సిలరేటర్ (రూ.25 కోట్లు), సిటీ సిమ్యులేటర్ (రూ.9.5 కోట్లు), బ్రాకీథెరపీ (రూ.7.5 కోట్లు) ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల, క్యాన్సర్ రోగులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇక నుంచి కేజీహెచ్‌లో ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కేజీహెచ్‌తోపాటు కర్నూలులో కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, దీనికి గాను కేంద్రం ఇప్పటికే నిధులు కూడా కేటాయించిందని వివరించారు. క్యాన్సర్ లక్షణాలున్న వారిని గుర్తించేందుకు త్వరలో ప్రత్యేక సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, పి.విష్ణుకుమార్ రాజు, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, డీఎంఈ డాక్టర్ రఘునందన్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంకాలజీ విభాగం వైద్యాధికారులు పాల్గొన్నారు.



పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

క్యాన్సర్ వల్ల ముగ్గురు కుటుంబ సభ్యులను కోల్పోయాను

క్యాన్సర్ మహమ్మారి వల్ల తమ కుటుంబంలో ముగ్గురు వ్యక్తులను కోల్పోయానని వైద్య కళాశాల సెంటినరీ భవనంలో వైద్య విద్యార్థులు, వైద్యులతో జరిగిన మీట్-గ్రీట్‌లో మంత్రి సత్యకుమార్ భావోద్వేగానికి గురయ్యారు. అమ్మ, సోదరుడు, అక్క వేర్వేరు సమయాల్లో ప్రాణాలు విడిచారని వివరించారు. ఈ ఘటనలు తనను ఎంతగానో కలచివేశాయని, అందుకే క్యాన్సర్ మహమ్మారిపై ప్రజాప్రతినిధిగా పోరాటం చేస్తున్నానన్నారు.

క్లుప్తంగా

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాంకీ

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులో పెరుగుబజార్ జంక్షన్ వద్ద సువర్ణ సిద్ధి వినాయక నవరాత్రుల మహోత్సవంలో భాగంగా అనకాపల్లి గోల్డ్ మర్చంట్స్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) సోమవారం మధ్యాహ్నం ప్రారంభించారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ బంగారుల వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భారీ గణపతిని దర్శించుకున్న మంత్రి సత్యకుమార్



లక్ష్మీ గణపతి సన్నిధిలో మంత్రి సత్యకుమార్ యాదవ్

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన 126 అడుగుల భారీ గణపతి విగ్రహాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం రాత్రి దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు బుద్ధ భూలోకనాయుడు స్వామివారి చిత్రపటాన్ని మంత్రికి అందజేశారు.

కశింకోటలో భారీ వర్షం



కశింకోటలో పడుతున్న వర్షం

కశింకోట: భీకర ఉరుములు, మెరుపులతో సోమవారం కశింకోటలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. స్థానిక పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు, జాతీయ రహదారి పక్క పల్లపు ప్రాంతాలు, కాలువలలో నీరు చేరింది. ఆయా రోడ్లపై రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది చెందారు. వర్షం వల్ల రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తర్వాత సాయంత్రం పునరుద్ధరించారు. మళ్లీ రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వర్షం నాటిన వరి నాట్లకు, కొత్తగా నాట్లు వేయడానికి బాగా ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 84 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,500
రెండో రకం	3,800	4,380
మూడో రకం	3,400	3,430

అనకాపల్లి సినిమాలు

రాజా	: త్రిబాణధారి బార్బరిక్
సత్యనారాయణ స్క్రీన్-1	: కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2	: బ్రహ్మాండ
పర్తిసాయి	: మహావతార్ నరసింహం (మ్యాట్నీ, సెకండ్ షో)
పర్తిసాయి	: అర్జున్ చక్రవర్తి (మార్నింగ్ షో, ఫస్ట్ షో)
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: బన్ బట్టర్ జామ్
శ్రీ సత్య	: హరిహర వీరమల్లు
రామచంద్ర	: వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 85 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11, బీ పాజిటివ్-24, ఓ పాజిటివ్-44, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

సచివాలయాలకు మంగళం

- త్వరలో 'డిజిటల్ లక్ష్మి' కేంద్రాలు
- వీటి ద్వారా పౌర సేవలు
- ప్రజలపై పడనున్న ఆర్థిక భారం
- మీ సేవల్లో మాదిరిగా అదనపు వసూళ్ల తప్పవని ఆందోళన



పట్టణంలోని ఉడ్‌పేట 7, 8 సచివాలయాల బిల్డింగ్



సచివాలయంలో మూలకు చేరిన ప్రింటర్

అనకాపల్లి టౌన్: గ్రామీణ, పట్టణ ప్రజలకు 2019కి ముందు కష్టాలే మళ్లీ మొదలయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సచివాలయాల వ్యవస్థపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. ఇప్పటికే వలంటీరు వ్యవస్థను ఎత్తివేసిన కూటమి సర్కారు ప్రస్తుతం సచివాలయాల్లో పౌర సేవలను నిలిపివేసింది. వాటిని వాట్సాప్ ద్వారా తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నా, వాటిపై అవగాహన లేక చాలామంది వినియోగించుకోవడం లేదు. దాంతో తాజాగా డిజిటల్ లక్ష్మి పేరిట కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. వీటి ద్వారా అందే సేవలకు ప్రజలపై ఆర్థిక భారం పడనుంది. దాంతో మీ సేవల్లో మాదిరిగా అదనపు వసూళ్ల తప్పవని ఆందోళన వ్యక్తమవుతోంది.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు ప్రతి పనికీ మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. దీనికి పరిష్కార మార్గంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ నేడు అస్తవ్యస్తంగా మారింది. పట్టణ పరిధిలో 27 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతీ సచివాలయంలో అడ్మిన్, డేటా ప్రాసెసర్, హెల్త్ సెక్రటరీ, వీఆర్వో, మహిళా పోలీస్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎమినిటీస్, ప్లానింగ్ కార్యదర్శి, శానిటేషన్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శి ఇలా తొమ్మిది మంది సిబ్బందిని నియమించింది. వీరి ద్వారా ప్రజలకు సుమారు 150 సేవలందించేలా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ రికార్డులలో మార్పులు చేర్పులు, ఆధార్ సేవలు, ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు, పింఛను కోసం దరఖాస్తు, డ్యాకుమెంటరీ రైటర్స్ లేకుండా భూముల రిజిస్ట్రేషన్ ఇలా అనేక సేవలు నామమాత్రపు రుసుంతోనే నిరంతరాయంగా సేవలందించేవారు. ఇప్పుడా పరిస్థితులు తలకిందులుగా మారాయి. ఏ సచివాలయంలోనూ పూర్తిస్థాయిలో సేవలందడంలేదు. ఏ చిన్న పనికి వెళ్లినా ఒకటికి పదిసార్లు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ముఖ్యంగా విద్యార్థులు, పోటీ పరీక్షలు రాసే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సచివాలయాల్లో స్టేషనరీ కొరత

ఒకట్రెండు సచివాలయాలు మినహాయిస్తే ఏ సచివాలయంలోనూ ప్రింటర్స్ పనిచేయడం లేదు. పనులను ఎలాగోలా పూర్తిచేసి ఆయా సర్టిఫికెట్లను ఫోన్లకు పంపించి మీ సేవా కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాలని సూచిస్తున్నారు. నిరక్షరాస్యులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వస్తే జెరాక్స్ కావాలని చెప్పడంతో సమీపంలో జెరాక్స్ సెంటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా సమస్యపై, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే సంబంధిత దరఖాస్తును ఇవ్వడంలేదు. జెరాక్స్ తీసుకొని ఒరిజినల్ మరలా తమకు ఇవ్వాలని సిబ్బంది సూచిస్తున్నారు. సచివాలయాల ఉద్యోగులకు ఎటువంటి స్టేషనరీ ఖర్చులు ఇవ్వడం లేదు. దీంతో తెల్లకాగితం దగ్గర నుంచి ఏది కావాలన్నా సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు.

'డిజిటల్ లక్ష్మి'లోకి సచివాలయ సేవలు

కూటమి ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే కుతంత్రంతో వీటి పరిధిలో డిజిటల్ లక్ష్మి పేరుతో కొత్తగా కేంద్రాలను ఏర్పాటు చేయబోతోంది. ఈ మేరకు డ్వాక్రా గ్రూపులో విద్యార్హత కలిగిన మహిళలను ఎంపిక చేసి వారికి రెండు లక్షల రూపాయల బ్యాంకు రుణం ఇవ్వనుంది. ఈ మొత్తంతో కంప్యూటర్, ప్రింటర్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కొనుగోలు చేసి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఈ కేంద్రాల ద్వారా సచివాలయ సేవలందించనున్నారు. మొత్తం పట్టణంలో 43 మంది మహిళలను ఎంపిక చేసినట్టు సమాచారం.

సచివాలయాలపై శీతకన్ను



కూటమి అధికారంలోకి వచ్చాక నేడు సచివాలయాలపై శీతకన్ను వేసింది. ఏ పని కావాలన్నా సచివాలయాల చుట్టూ ఒకటికి పదిసార్లు తిరగాల్సి వస్తోంది. అందులో పని చేస్తున్న ఉద్యోగులను హేతబద్ధీకరణ చేయడంతో సరిగ్గా సేవలందడం లేదు. ముఖ్యంగా విద్యార్థుల సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– సిహెచ్ శ్రీను, అనకాపల్లి

నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోంది

సచివాలయాలు పెట్టిన తర్వాత వలంటీర్లే ఇంటికి వచ్చి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఏదైనా సర్టిఫికెట్ ఒరిజినల్ ఇవ్వడం లేదు. మరలా నెట్ సెంటర్లకు వెళ్లి డబ్బులు వెచ్చించి తీసుకోవాల్సి వస్తోంది.

–శ్రీలక్ష్మి, అనకాపల్లి

ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి

అనకాపల్లి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెదిరెడ్డి నాగేశ్వరరావు, కోరుబిల్లి జగదీష్, గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ్ వాపోయారు. వారికి ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ)లో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక జాతీయ రహదారి పూడిమడక జంక్షన్ ఎంపీ కార్యాలయంలో ఎంపీ సీఎం రమేష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓలా, ఉబర్, రాపిడ్ 2 వీలర్ లాంటి ఆన్‌లైన్ యాప్‌లను రద్దు చేయాలని, ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలను కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.మార్కండేయులు, సహాయ కార్యదర్శులు సూరిశెట్టి బాపునాయుడు, కొణతాల రాము పాల్గొన్నారు.

అనకాపల్లి డీటీగా శాంతిభూషణ్



అనకాపల్లి: అనకాపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా శాంతిభూషణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాయకరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన డీటీ కె.కుమార్ స్వామికి 20 రోజులు క్రితం తహసీల్దార్‌గా పదోన్నతి రావడంతో అనకాపల్లి నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, పెదిశెట్టి గోవింద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. కార్పొరేటర్లు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

కశింకోట: స్థానిక ప్రధాన రహదారిలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, శ్రేణులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని నిరసన



కశింకోటలో భవన నిర్మాణ కార్మికుల నిరసన ప్రదర్శన

కశింకోట: తమకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కశింకోటలో భవన నిర్మాణ కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, జి. అప్పలకొండ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికునికి పింఛన్ ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ సామగ్రి ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి. మహేష్, ఉపాధ్యక్షుడు ఆర్. రాము, సహాయ కార్యదర్శి పి. తాతారావు, కోశాధికారి డి. సత్యారావు, సలహాదారు కె. అప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

అనకాపల్లి టౌన్: రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ పట్టణ నేత వైఎస్ భద్రం విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు నాట్లు వేసుకొని యూరియా కోసం ఎదురుచూస్తుండగా ప్రభుత్వం నిర్లక్ష ధోరణి చూపుతుందన్నారు. అధిక ధర పెట్టి ప్రైవేటు వ్యాపారుల దగ్గర కొందామంటే గుళికలు తీసుకోవాలని మెలిక పెడుతున్నారని వాపోయారు. దీంతో రైతులు అవసరం లేకపోయినా గుళికలు మందు తీసుకొని తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విజిలెన్స్ అధికారులు ప్రైవేట్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి యూరియా ఎమ్మార్పీకే అమ్మకాలు జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ రైతు సంఘం ఉపాధ్యక్షుడు కోరిబిల్లి శంకర్రావు, మత్తుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ మొరాయించి పింఛన్‌దారులు ఇబ్బంది



కశింకోటలోని కనకమహాలక్ష్మి వీధిలో పింఛన్ సొమ్ము కోసం పింఛన్‌దారుల నిరీక్షణ



సర్వర్ పని చేయడంతో పింఛన్ సొమ్ము అందజేత

కశింకోట: కశింకోటలో సోమవారం గంటకు పైగా సర్వర్ మొరాయించడంతో పింఛన్‌దారులు ఇబ్బంది పడ్డారు. స్థానిక కనకమహాలక్ష్మివీధిలో పింఛన్ల పంపిణీకి వచ్చిన సచివాలయ సిబ్బంది ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్ము పంపిణీ చేపట్టగా ఉదయం 7 నుంచి గంటకుపైగా సర్వర్ మొరాయించింది. దీంతో పింఛన్‌దారులు ఇళ్ల నుంచి అక్కడి రామాలయం వద్దకు చేరుకొని మూకుమ్మడిగా సర్వర్ ఎప్పుడు పని చేస్తుందా? ఎప్పుడు పింఛన్ సొమ్ము ఇస్తారా? అని ఎంతో ఆత్రుతగా గంటపైగా నిరీక్షించారు. ఈ నేపథ్యంలో సర్వర్ పని చేయడంతో పింఛన్ సొమ్మును సిబ్బంది పంపిణీ చేశారు.

అకస్మాత్తుగా తహసీల్దారు కార్యాలయం తరలింపు

సమస్యలపై వచ్చిన ప్రజలు అయోమయం



కశింకోట 2వ సచివాలయ భవనంలో తహసీల్దార్ విధులు



శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

కశింకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మరో భవనంలోకి తరలించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద సచివాలయ భవనంలోకి తరలించి సోమవారం నుంచి ఇక్కడ విధులు నిర్వహించడం ప్రారంభించారు. అకస్మాత్తుగా కార్యాలయాన్ని మార్చడంతో ఆ విషయం తెలియక ప్రజలు అయోమయానికి గురై ఇబ్బంది పడ్డారు. వ్యవసాయ కార్యాలయం ఇప్పటి వరకు అదే భవనంలో నడిచేది. దీని కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో సచివాలయ భవనంలో చేరి కొంతకాలంగా విధులను నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయం విధుల నిర్వహణకు సరిపోవడం లేదని, శిథిలావస్థలో చేరిందని కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి తీసుకెళ్లి అనుమతి తీసుకొని సచివాలయాన్ని ఖాళీ చేయించి దానిలోకి మార్పు చేశారు. అక్కడి వ్యవసాయ కార్యాలయాన్ని తహసీల్దార్ కార్యాలయానికి మార్పు చేశారు. అయితే భవన స్తంభాలు, శ్లాబ్ శిథిలావస్థలో ఉండటం, కార్యకలాపాల నిర్వహణకు అనువుగా లేదని వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఈ కార్యాలయం కూడా మారిన సంగతి తెలియక రైతులు ఇబ్బంది పడ్డారు.

తండ్రికి కుమార్తె తలకొరివి



తండ్రి మృతదేహానికి తలకొరివి పెడుతున్న కుమార్తె

తుమ్మపాల: గుండెలో నుంచి ఉబికివస్తున్న దుఃఖాన్ని అదిమిపెట్టుకుని తన తండ్రి మృతదేహానికి కుమార్తె తలకొరివి పెట్టింది. ఈ విషాద ఘటన మండలంలో రేబాక గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కోన కోటేశ్వరరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. అతడికి వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె రవళిని గ్రామంలోనే బంధువుల వ్యక్తికి ఇచ్చి వివాహం చేశాడు. అప్పటి నుంచి తండ్రికి కొడుకు లేని లోటును తీర్చుతూ అన్ని పనులు ఆమే చూసుకుంటోంది. ఈ నేపథ్యంలో కోటేశ్వరరావు సోదరుడు అనారోగ్యంతో ఉండటంతో తండ్రి అంతిమ సంస్కారం చేసి రుణం తీర్చుకుంది.

తేగాడ కేజీబీవీలో స్మార్ట్ క్లాస్ రూం ప్రారంభం



బాలికల హైస్కూలులో స్మార్ట్ క్లాస్ రూం ప్రారంభిస్తున్న ఎంపీ సీఎం రమేష్

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలు, తేగాడలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాలకు ఓఎన్‌జీసీ సహకారంతో సమకూర్చిన స్మార్ట్ క్లాస్ రూంలను సోమవారం ఎంపీ సీఎం రమేష్ ప్రారంభించారు. రూ.1.5 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ డిజిటల్ స్మార్ట్ ప్రాజెక్టు, హార్డు డిస్కను ఓఎన్‌జీసీ సమకూర్చింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించే ఐదుగురు బాలికలకు రూ.15 వేలు, రూ. 10 వేల వంతున ప్రత్యేక ప్రోత్సహకాలు తాను అందజేయనున్నట్లు ప్రకటించారు. డీఈవో గిడ్డి అప్పారావు మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరుకోవడానికి విద్యావంతులు కావాలని, తాను పేపర్ బాయి స్థాయి నుంచి డీఈవో కాగలిగానంటే విద్యే కారణమన్నారు. హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు ఓ. కుమారి, జిల్లా సైన్స్ అధికారి దాడి కాళిదాస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ. రవి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో ధర్మారావు, ఏవో ఎం. స్వప్న, ఎంఈవోలు సురేష్‌కుమార్, కేఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత హైటెక్ జట్టు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మునగపాక: ప్రతి ఒక్కరూ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. మునగపాక నందీశ్వర కళా ప్రాంగణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలకు ఆదివారం రాత్రి ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. చెడు వ్యసనాలకు గురి కాకుండా సమాజానికి మేలు చేసే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీకి ఎంతో ఆదరణ ఉందన్నారు. ప్రో కబడ్డీ వచ్చాక కబడ్డీపై మరింత ఆసక్తి చూపుతున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని చెప్పారు. గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మాజీ ఎంపీటీసీ టెక్కలి పరశురామ్, నిర్వాహకులు టెక్కలి సురేంద్ర, ఆడారి సూరిబాబు, ఆడారి శ్రీకాంత్, పెంటకోట అప్పలనాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో మునగపాకకు చెందిన హైటెక్ టీమ్, ద్వితీయ స్థానంలో డేంజర్ గాయ్స్ జట్టు, తృతీయ స్థానంలో ప్రగతి స్కూల్ జట్టు నిలిచాయి.


ఎరువుల దుకాణాల్లో తనిఖీ

యలమంచిలి రూరల్: మండలంలోని పులపర్తి వెంకటసత్యనారాయణ ట్రేడర్స్, లక్కవరం పీఏసీఎస్‌ల్లో సోమవారం విజిలెన్స్, వ్యవసాయాధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎరువుల స్టాకు, అమ్మకాల వివరాలు పరిశీలించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువుల అమ్మకాలకు సంబంధించి రైతులకు తగు రసీదు ఇస్తున్నారో? లేదో? ఆరా తీశారు. యలమంచిలి మండలంలో 40 మెట్రిక్ టన్నుల ఎరువు అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు తెలిపారు. విజిలెన్స్ అధికారి శంకర్ లాల్ నాయక్, శంకర్ గోవింద్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

మాడుగుల: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగులను రెగ్యులర్ చేసి గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలంటూ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి మండలంలో గాదిరాయి గ్రామంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎస్ఎస్ఏ, మండల విద్యాశాఖ కార్యాలయం, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డేటా ఎంట్రీ కోఆర్డినేటర్‌లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లుగా, పీఈటీలుగా కేజీబీవీల్లో ఎస్‌వోలుగా, ఐఈఆర్‌టీలుగా, సీఆర్‌పీలుగా, ఒకేషనల్ టీచర్లుగా పనిచేస్తున్న తమకు రెగ్యులర్ ఊసేలేదని, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఎంటీఆర్ లేదని, హెచ్ఆర్ లేదని, ఉద్యోగ విరమణ తర్వాత గ్రాట్యూటీ అయినా చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీలు

రావికమతం: ఆదివాసీలకు అన్యాయం చేస్తూ రికార్డులను తారుమారు చేస్తున్న గొలుగొండ తహసీల్దార్ పి.శ్రీనివాసరావును సస్పెండ్ చేయాలని, రెవెన్యూ విజిలెన్స్ విభాగం ఆదేశాల మేరకు విచారణ అధికారిని జిల్లా కలెక్టర్ నియమించాలని, పాత మల్లంపేట ఆర్వోఆర్ దస్త్రాలను వెంటనే స్వాధీన పర్చుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారురావు డిమాండ్ చేశారు. రావికమతం మండలం వలసలపాలెంలో ఏపీ ఆదివాసీ సంఘం ఏడు మండలాల కార్యకర్తల సమావేశం ఆ సంఘం జిల్లా కన్వీనర్ మోసూరు రాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. బుగతా బంగారురావు మాట్లాడుతూ తహసీల్దార్ అక్రమాలపై ఆదివాసీలు ఉన్నధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు అతనిపై ఎటువంటి విచారణ చేయలేదని అన్నారు. అధికారులు స్పందించి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈ నెల 4వతేదీ నుంచి 15 వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో నిరసన కార్యాక్రమాలు నిర్వహిస్తామని, అప్పటికీ అధికారులు నుంచి స్పందన లేకపోతే సెప్టెంబర్ 22న చలో సబ్ కలెక్టర్ కార్యాలయం కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు.